## గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

ములుగురూరల్, నవంబర్ 21 : ములుగు మండలం రాంనగర్‌తండాలో గురువారం పోలీసులు గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ఎస్సై-3 లక్ష్మారెడ్డి, సిబ్బంది కలిసి గుగులోత్ స్వరూప, భూక్యా శ్రీరామ్, అజ్మీరా అనిల్, పోట్టీయా తార, లావుడ్యా శ్రీనివాస్ నుంచి 20 కిలోల బెల్లం, 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీంతో పాటు 300 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశామన్నారు. నిందితులను, బెల్లం, గుడుంబాను స్టేషన్‌కు తరలించి ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

## ప్రత్యేక నిధులు కేటాయించాలని కలెక్టర్‌కు వినతి

ములుగురూరల్, నవంబర్ 21 : ఈ నెల 26న 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ గురువారం దళిత సంఘం నాయకులు కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ విగ్రహంతో పాటు ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు పెయింటింగ్ వేయించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జన్ను రవి, మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర కార్యదర్శి చుంచు రవి, అంబేద్కర్ భవన్ విగ్రహ నిర్మాణ సమితి జిల్లా చైర్మన్ నెమలి నర్సయ్య పాల్గొన్నారు.

## మైనార్టీ అభ్యర్థులకు మాక్ టెస్టులు

ములుగురూరల్, నవంబర్ 21 : గ్రూప్-2 సర్వీసెస్ పరీక్షలో పాల్గొనే మైనార్టీ అభ్యర్థులకు రెండు ఫ్రీ ఫుల్ లెంత్ మాక్ టెస్టులను నిర్వహించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29లోగా దరఖాస్తు చేసుకున్న వారికి డిసెంబర్ 2,3,9,10 తేదీల్లో మాక్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. వివరాలకు 9989661146 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## సర్వే వివరాలు కంప్యూటర్‌లో నమోదు

వాజేడు,నవంబర్,21 : మండలంలో ఇటీవల నిర్వహించి సమగ్రకుటుంబ కులసర్వే వివరాలను గురువారం నుంచి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో కంప్యూటర్లలో నమోదు ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. తప్పులు లేకుండా వివరాలు నమోదు చేయాలని డేటా ఆపరేటర్లకు ఎంపీవో శ్రీకాంత్ నాయుడు సూచనలు చేశారు.

## జాతీయ స్థాయి సదస్సును విజయవంతం చేయాలి

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 21 : ఆదివాసీ జాతీయ స్థాయి సదస్సును విజయవంతం చేయాలని గిరిజన అభ్యుదయ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చందా లింగయ్య దొర అన్నారు. గురువారం మండలకేంద్రంలోని అటవీ శాఖ అతిథి గృహం ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 26 నుంచి 28 వరకు ఆదివాసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివాసీ సంఘాల జేఏసీ చైర్మన్ పాయం సత్యనారాయణ, పొలిటికల్ జేఏసీ కన్వీనర్ వాసం రామకృష్ణ, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అలెం కోటి, గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి, ప్రతాప్, ఆర్కె, నాగశంకర్ ఉన్నారు.

## కుక్కల బెడద లేకుండా చేస్తాం..

కృష్ణకాలనీ, నవంబర్ 21 : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద లేకుండా చేస్తామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ గంధమల్ల నవీన్ కుమార్ అన్నారు. గురువారం అంబేద్కర్ సెంటర్‌లో కుక్కలు పట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. 30 వార్డుల్లోని కుక్కలను త్వరగా పట్టి హనుమాన్‌నగర్‌లోని యానిమల్ సెంటర్‌కు తరలించి, అక్కడ పశు వైద్యులు వాటికి ఆపరేషన్ చేసిన తర్వాత వదిలేస్తామన్నారు. కుక్కలు ఉంటే 91107 87841 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. 16వ వార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, పృథ్వీ, సిబ్బంది పాల్గొన్నారు.

## మాంసం దుకాణాలను తరలించాలి

కృష్ణకాలనీ, నవంబర్ 21 : జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న మటన్, చికెన్ సెంటర్లను వెంటనే పట్టణం బయటకు తరలించాలని సీపీఐ భూపాలపల్లి పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మటన్, చికెన్ సెంటర్ల యజమానులు పరిశుభ్రమైన మాంసం విక్రయించడం లేదన్నారు. ముఖ్యంగా ఆరోగ్యంగా ఉన్న మేకలు కోయడంలేదని ఆరోపించారు. దుకాణాలు మెయిన్ రోడ్‌ను ఆనుకుని ఉండడం వల్ల దుమ్ము పడుతున్నదన్నారు. షాపులను వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన మార్కెట్‌కు తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు క్యాతరాజు సతీశ్, నూకల చంద్ర మొగిలి, వేముల శ్రీకాంత్, నేరెళ్ల జోసెఫ్, పీక రవి, లోకిని రమేశ్, గోనెల తిరుపతి, ఏకు రాములు పాల్గొన్నారు.

## ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

భూపాలపల్లి రూరల్/ ములుగు రూరల్, నవంబర్ 21 : ఓటు నమోదుకు ఈనెల 23, 24 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు భూపాలపల్లి, ములుగు జిల్లాల కలెక్టర్లు రాహుల్‌శర్మ, టీఎస్ దివాకర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, వారికి నేరుగా ఓటు నమోదు కోరుతూ దరఖాస్తులు అందించవచ్చన్నారు. ee voters.eci.gov.in ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

# మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగుచేయాలి

**కేంద్ర సహాయ మంత్రి**
**నిముబెన్ జయంతిబాయ్ బంబానియా**




మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి నిముబెన్ జయంతిబాయ్ బంబానియా, రామప్పలో పూజలు

రేగొండ, నవంబర్ 21 : రైతులు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేసినప్పుడే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని కేంద్ర సహాయ మంత్రి నిముబెన్ జయంతి బాయ్ బంబానియా అన్నారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, పీహెచ్‌సీ, రూపిరెడ్డిపల్లెలోని రైతు సహకార సంఘాన్ని గురువారం కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఆమె సందర్శించారు. అనంతరం పాఠశాల ల్యాబ్, దవాఖాన ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, రికార్డులతో పాటు రైతు సహకార సంఘం చేస్తున్న సేవలను పరిశీలించారు. 8వ తరగతి విద్యార్థులతో పాఠాలు చదివించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం చేయించి, గర్భిణులకు సీమంతాలు జరిపించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు చేయించుకొని వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలతో భూమి పరిస్థితిని బట్టి పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. ఉత్పత్తులు అమ్ముకోవడానికి సీడబ్ల్యూసీ కేంద్రాలు ఏర్పాటు చేయడం, మాతా శిశు ఆరోగ్యం, పిల్లల విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. మారుమూల గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ యాస్పిరేషన్ 500 బ్లాకులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో మహాముత్తారం, పలిమెల మండలాలను నీతి ఆయోగ్ యాస్పిరేషన్ బ్లాకులుగా ప్రకటించినట్లు తెలిపారు. ఈ మండలాల్లో వ్యవసాయం, విద్య, వైద్యం, డీఆర్‌డీఏ, ఉద్యాన సంక్షేమ శాఖ పారామీటర్లు నిర్దేశించామన్నారు. కార్యక్రమంలో మంత్రి ఆదనపు కార్యదర్శి ఖుష్బూ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఏవో విజయ్‌భాస్కర్, డీఎంహెచ్‌వో మధుసూదన్, సంక్షేమ అధికారి చిన్నయ్య, డీఈవో రాజేందర్, సీపీవో బాపురావు, తహసీల్దార్ శ్వేత, ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు, సొసైటీ చైర్మన్ బుచ్చిరెడ్డి, డైరెక్టర్ సుధాకర్ పాల్గొన్నారు.

**రామప్ప సందర్శన**

వెంకటాపూర్: ప్రపంచ వారసత్వ కట్టడమైన రామప్ప దేవాలయాన్ని కేంద్ర సహాయ మంత్రి గురువారం సందర్శించారు. మంత్రికి కలెక్టర్ టీఎస్ దివాకర స్వాగతం పలికారు. అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూర్ణకుంభంతో స్వాగతం పలికి వారితో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ మండపంలో పట్టు వస్త్రాలతో సత్కరించి, వేదమంత్రాలతో ఆశీర్వచనం అందజేశారు. ఆలయ చరిత్ర, శిల్పకళ ప్రాముఖ్యతను టూరిజం గైడ్స్ ద్వారా తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రామప్ప శిల్పకళ అద్భుతమని, నీటిలో తేలియాడే ఇటుకలు, నాటి టెక్నాలజీ అత్యద్భుతమని కొనియాడారు. రామప్పకు యునెస్కో గుర్తింపు తర్వాత చేసిన అభివృద్ధి, చేస్తున్న, చేయబోయే పనులను కలెక్టర్ ఆమెకు వివరించారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేశారు. ఆర్డీవోలు వెంకటేష్, మంగీలాల్, డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సై సతీశ్, ఎంపీడీవో రాజు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం చేస్తే నిర్వాహకులపై చర్యలు తప్పవు

**భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ**



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

రేగొండ, నవంబర్ 21 : ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతు సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. మండలంలోని రూపిరెడ్డిపల్లెలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాల్లో సౌకర్యాలు ఉన్నాయా? లేవా అని ఎప్పటికప్పుడు చూడాలని అధికారులను ఆదేశించారు. కోతలు, కటింగ్‌లు లేకుండా కాంటాలు నిర్వహించాలని, ఎక్కడైనా గొలుసు కాంటాలు కనిపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యంలో తేమ శాతం 17 ఉంటే జాప్యం లేకుండా కొనాలన్నారు. పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆయన వెంట జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, మార్కెటింగ్ అధికారి కనుక శేఖర్, డీఎస్పీ సంపత్‌రావు, సంఘం చైర్మన్ బుచ్చిరెడ్డి, సీఈవో జగన్ ఉన్నారు.

## జూనియర్ కళాశాలలో మెరుగైన వసతులు

- సత్వర ప్రతిపాదనలకు ఆదేశాలు
- ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా



అధికారులకు సూచనలు చేస్తున్న ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా

ఏటూరునాగారం, నవంబర్ 21 : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు వెంటనే ప్రతిపాదనలు, అంచనాలు సిద్ధం చేయాలని గిరిజన సంక్షేమశాఖ ఈఈ వీరభద్రంను ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను పీవో గురువారం సందర్శించి ప్రస్తుతం ఉన్న భవనాలు, మైదానం, నిరుపయోగంగా ఉన్న భవనం, శిథిలావస్థకు చేరుకున్న భవనాలను పరిశీలించారు. కూలిపోయే స్థితిలో ఉన్న ముందు భవనాన్ని కూల్చి వెనుకవైపు చదును చేయాలని సూచించారు. మైదానాన్ని పరిశీలించి పూర్తిగా లెవలింగ్ చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న భవనాలను ఉపయోగంలోకి తేవడంతో పాటు సెమినార్లు, ట్రైనింగ్‌లకు ఉపయోగపడేలా ఏర్పాటు చేయాలన్నారు. ప్రహరీ కోసం ప్రతిపాదనలు పంపాలన్నారు. టాయిలెట్స్, నీటి వసతి ఉండేలా చూడాలని, కళాశాల వెనుకవైపు నిరుపయోగంగా ఉన్న భవనాన్ని కూడా వినియోగంలోకి తేవాలన్నారు. కళాశాల ఆకర్షణీయంగా కన్పించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రస్తుతం ఐసీడీఎస్‌కు సంబంధించిన భవనంలో లైబ్రరీ నడుస్తున్న విషయం తెలుసుకుని అక్కడ నుంచి కళాశాల ఆవరణలోకి మార్చాలని సూచించారు. కళాశాలలో సైన్స్, ఆర్ట్స్ విద్యార్థుల సంఖ్యను తెలుసుకున్నారు. నీట్, ప్రాక్టికల్స్, కోచింగ్‌కు ఉపయోగపడేలా భవనాలను తీర్చిదిద్దాలన్నారు. ఆమెవెంట కళాశాల అధ్యాపకులు, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

## గ్రామ పంచాయతీల నిధుల ఖర్చుపై ఆడిట్

వాజేడు, నవంబర్ 21 : మండలంలోని ప్రగళ్లపల్లి గ్రామంలో ఉన్న మొరుమురు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జీపీ నిధుల వ్యయాలపై ఆడిట్ నిర్వహించారు. మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో 2023-24 సంవత్సరంలో పంచాయతీ నిధుల ఖర్చులకు సంబంధించిన వివరాలతో వచ్చిన కార్యదర్శుల సమక్షంలో బిల్లులు పరిశీలించి అధికారులు ఆడిట్ నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆడిట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆడిట్ అధికారులు శ్రీను, ధీరజ్, పంచాయతీ కార్యదర్శులు చాట్ల ప్రభాకర్, శ్రీకాంత్, కార్తీక్, రేఖశ్రీ, బందం రవీందర్ పాల్గొన్నారు.

## సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నాం

**ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**

భూపాలపల్లి రూరల్/ గణపురం, నవంబర్ 21: రైతులకు ఇచ్చిన హామీ మేరకు సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం భూపాలపల్లి మండలం కమలాపూర్, నాగారం, ఆజంనగర్, నందిగామ, దీక్షకుంట, పంబాపూర్, గొల్లబుద్ధారం, నేరేడుపల్లి, వజినేపల్లి, గొర్లవీడు, కొంపెల్లి, ఎస్ఎం కొత్తపల్లి, గణపురం మండలం బస్వరాజుపల్లి, పరశురామ్‌పల్లి, నగరంపల్లి, అప్పయ్యపల్లి, సీతారాంపూర్, బంగ్లాపల్లి, కొండాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. దళారుల చేతుల్లో మోసపోకుండా రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. అలాగే గొల్లబుద్దారంలో సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు నిర్వహిస్తున్న ప్రజాపాలన కళాయాత్రలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. పేద ప్రజలకు అభివృద్ధి పథకాలను అందించేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో కమ్మల ప్రవీణ్‌కుమార్, చిలుముల మధుబాబు, పులి రాధిక, జాడి సుమలత, సెగ్గం శిరీష, కాస స్వాతి, గడ్డం నాగమణి, చీకట్ల శంకర్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

## వరుస దొంగతనాలు చేస్తున్న మైనర్ అరెస్ట్

గణపురం, నవంబర్ 21: మండలంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న మైనర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి రూ. 5 వేల నగదు, 25 తులాల వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో చిట్యాల సీఐ మల్లేశ్, ఎస్సై రేఖ అశోక్ గురువారం వివరాలు వెల్లడించారు. మండలకేంద్రానికి చెందిన ఓ బాలుడు ఆన్‌లైన్ బెట్టింగ్, పేకాట, కోడి పందేలు తదితర చెడు వ్యసనాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో చోరీలకు సిద్ధపడ్డాడు. తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి వరుస చోరీలు చేశాడు. అంతేకాకుండా అతడిపై అనుమానం రాకుండా తన ఇంట్లో కూడా చోరీ జరిగినట్లు తలుపులు, బీరువా పగలగొట్టి గ్రామస్తులను నమ్మించాడు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు అంగడి వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని తనిఖీ చేసి విచారించగా వరుస చోరీలకు పాల్పడినట్లుగా అంగీకరించాడు. దొంగను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సీఐ, ఎస్సై, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## జిల్లాకు రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేయాలి

**సీపీఎం జాతీయ నాయకుడు నాగయ్య**

కృష్ణకాలనీ, నవంబర్ 21 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రానికి రైల్వే మార్గాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం జాతీయ కార్యవర్గ సభ్యుడు నాగయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సింగరేణి మినీ ఫంక్షన్ హాలులో పార్టీ జిల్లా కార్యదర్శి బందు సాయిలు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి 3వ మహా సభలు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, అసంఘటిత కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, జిల్లాకు రైల్వే మార్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. బొగ్గు శుద్ధి కర్మాగారం, ఎరువులు, సిమెంటు కర్మాగారం ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. సింగరేణి ప్రాంతంలో ఉన్న బొగ్గు బ్లాకులను సింగరేణికి అప్పగించాలని డిమాండ్ చేశారు. పాత ఎర్ర చెరువులో గుడిసెలు వేసిన పేదలందరికీ ఇంటి పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంపేటి రాజయ్య, చెన్నూరు రమేశ్, పోలం రాజేందర్, వెలిసేటి రాజయ్య, గుర్రం దేవేందర్, సంఘం ప్రీతి, ఆతుకూరి శ్రీకాంత్, మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

## టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు

భూపాలపల్లి రూరల్, నవంబర్ 21 : టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు ఎటువంటి అపరాధ రుసుము లేకుండా పరీక్ష రాసేందుకు డిసెంబర్ 3లోగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో రాజేందర్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి మందల రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోయర్ గ్రేడ్ పరీక్షకు 7వ తరగతి పాసై ఉండాలని, హైయ్యర్ గ్రేడ్ పరీక్షలు రాసేవారు లోయర్ పరీక్షలు పాసై ఉండాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు bse.telangana.gov.inలో దరఖాస్తు చేసిన తర్వాత ఆన్‌లైన్ అప్లికేషన్ ఫాంతో ఒరిజినల్ చలాన్, ఆధార్ కార్డు, 7వ, పదో తరగతి సర్టిఫికెట్ జతపరచి డీఈవో కార్యాలయంలో డిసెంబర్ 4లోపు అందజేయాలని పేర్కొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

చిట్యాల, నవంబర్ 21 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందున్న యువకుడు మృతిచెందాడు. పోలీసులు గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని గిద్దముత్తారం గ్రామాకి చెందిన సుద్దపల్లి పవన్ (24) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ లేబర్ పనికి వెళ్తుంటాడు. ఈనెల 11న కాల్వపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్లి లేబర్ పని చేసి తిరిగి వస్తుండగా బైక్‌కు కుక్క అడ్డుగారావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న కల్వర్టును ఢీకొనగా తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే చిట్యాల సివిల్ దవాఖానకు తరలించగా మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ప్రైవేట్ దవాఖానకు, మరుసటి రోజు వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

## రెడ్డి గాండ్లను బీసీలుగా గుర్తించొద్దు

కాటారం, నవంబర్ 21 : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రెడ్డి గాండ్ల కులస్తులను బీసీలుగా గుర్తించొద్దని కాటారం డివిజన్‌లోని బీసీ కుల సంఘాల నేతలు డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వర్‌కు గురువారం వినతిపత్రం ఇచ్చారు. హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో అఖిల గాండ్ల సంక్షేమ సంఘం కాటారం డివిజన్ అధ్యక్షుడు నిడిగొండ మైనర్ బాబు మాట్లాడుతూ రెడ్డి గాండ్ల కులస్తులకు గతంలో జారీ చేసిన తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు రద్దు చేయాలన్నారు. నాయకులు ఆత్మకూరి స్వామియాదవ్, సముద్రాల తిరుపతి, విజయగిరి సమ్మయ్య, ముక్కెర వినోద్‌గౌడ్, వెన్నంపల్లి మహేష్ పాల్గొన్నారు.

## కోడి పందేల స్థావరంపై సీసీఎస్ పోలీసుల దాడి

కాటారం, నవంబరు 21 : మండలంలోని దామరకుంట జీపీ పరిధిలోని కటుకుపల్లి అటవీ ప్రాంతంలో కోడి పందేల స్థావరంపై భూపాలపల్లి సీసీఎస్ పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. కాటారం ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోడి పందేలు ఆడుతున్నారని వచ్చిన సమాచారం మేరకు భూపాలపల్లి సీసీఎస్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై రమేశ్ తమ సిబ్బందితో అటవీప్రాంతంలో ఉన్న కోడి పందేల స్థావరాన్ని చుట్టుముట్టారు. పోలీసులను గమనించిన పలువురు పారిపోగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలం నుంచి రూ.11వేలు, 10 పందెం కోడి పుంజులు, వాటి కాళ్లకు కట్టే కత్తులు, 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ సీఐ తెలిపారు. కోడి పందేలు ఆడుతున్నవారిపై కేసు నమోదు చేసినట్లు కాటారం ఎస్సై అభినవ్ వెల్లడించారు.

## జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఏకగ్రీవం

భూపాలపల్లి రూరల్, నవంబర్ 21: జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ రాజవీర్, గౌరవ అధ్యక్షుడిగా ఏ మనోహర్, ఉపాధ్యక్షుడిగా బన్సీలాల్, ప్రధాన కార్యదర్శిగా బత్తుల రవీందర్, కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా పాలు కుమార్, ఎక్స్ మెంబర్‌గా ఆధామును ఎన్నుకున్నారు.

## అప్పుల బాధతో ఉపాధ్యాయుడి ఆత్మహత్య



బుచ్చయ్య (ఫైల్)

వాజేడు, నవంబర్ 21 : అప్పుల బాధతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై హరీశ్ కథనం ప్రకారం.. మండలంలోని కోయవీరపురం గ్రామానికి చెందిన చేప బుచ్చయ్య (55) పెద్దగొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. అప్పుల బాధతో గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన గ్రామస్తులు ఏటూరునాగారం వైద్యశాలకు తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందాడు. బుచ్చయ్య భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

## డేటా ఎంట్రీ తప్పులు లేకుండా చేపట్టాలి

ములుగురూరల్, నవంబర్ 21 : సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని తప్పులు లేకుండా చేపట్టాలని కలెక్టర్ దివాకర అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో చేపడుతున్న డేటా ఎంట్రీ తీరును ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంట్రీ నమోదుకు లాగిన్ ఇచ్చామని, బాధ్యతాయుతంగా చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 100శాతం సమగ్ర సర్వే చేపట్టినట్లు చెప్పారు. ఎంపీవో రహిమొద్దీన్, ఈడీఎం దేవేందర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## మండలంలో విద్యుత్ అధికారుల తనిఖీలు

ములుగురూరల్, నవంబర్ 21 : ములుగు మండలంలో 11కేవీ ములుగు-2 ఫీడర్‌లో నష్ట నివారణకు విద్యుత్ అధికారులు, సిబ్బంది బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏడీఈ వేణుగోపాల్ మాట్లాడుతూ వినియోగదారుల మీటర్లను పరిశీలించడంతోపాటు వాణిజ్య సంబంధిత, పరిశ్రమలు, వీధీపాలు, వాటర్ వర్క్స్, తదితర 961 మీటర్లను తనిఖీ చేశామన్నారు. వీటిలో 4 నిలిచిపోయిన మీటర్లు, 9 కాలిపోయిన మీటర్లుగా గుర్తించామని, ఫీడర్ పరిధిలో 401 మీటర్లలను సీజ్ చేయడంతో పాటు వినియోగదారుల కేటగిరి మార్పు, విద్యుత్ చోరీ కేసులను గుర్తించి రూ.1.75 లక్షల బకాయిలు వసూలు చేసినట్లు తెలిపారు. తనిఖీలో ఏఈలు రవి, దేవిసింగ్, సంపత్‌రావు, సతీశ్, ఇంజనీర్లు హరీశ్, సాంబరాజు, విష్ణు, శివ, అఖిల, సిబ్బంది ఉన్నారు.

## బెల్టుషాపులో చోరీ

ఏటూరునాగారం, నవంబర్ 21 : మండలంలోని బెల్టుషాపులో చోరీకి పాల్పడిన ఒకరిని గ్రామస్తులు పట్టుకున్న సంఘటన గురువారం తెల్లవారు జామున జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కొందరు బుధవారం రాత్రి మండల కేంద్రంలోని బెల్టుషాపు తాళాలు పగులగొట్టి మద్యం సేవించినట్లు సమాచారం. కాగా, తెల్లవారు జామున వారు షాపులో నుంచి బయటకు వస్తున్న క్రమంలో ఓ మహిళ చూసి ప్రశ్నించి అరవడంతో స్థానికులు అక్కడికి చేరుకోవడంతో భయంతో కొందరు పారిపోగా ఒకరిని అదుపులోకి తీసుకుని తాళ్లతో బంధించారు. వీరంతా మంగపేట మండలం కోమటిపల్లి, తదితర గ్రామాలకు చెందిన వారుగా అనుమానిస్తున్నారు. పట్టుబడిన వ్యక్తి అతిగా మద్యం సేవించి ఉండడం వల్ల వివరాలు తెలియరానట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలను గ్రామస్తులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

*I, MUDIDE RAJITHA (New Name), previously called MUDIDE RAJITA (Old Name), and residing at H.No. 6-6-9/D, Saraswathi Nagar Road Number-3, Sai Nagar Colony, Gopalpur, Hanamkonda Mdl., Hanumakonda District-506009, T.G., India, and solemnly declare.

NTW-000

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

## కార్మికులకు ప్రమోషన్ల ఆర్డర్ కాపీల అందజేత

భూపాలపల్లి రూరల్, నవంబర్ 21: కేటీకే-6 ఇంక్లైన్ గని మేనేజర్ రామ్ భరోస్ మహతో ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రమోషన్లు పొందిన కార్మికులకు ఆర్డర్ కాపీలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ మాట్లాడుతూ ఎంతోకాలం నుంచి ప్రమోషన్లను సింగరేణి యాజమాన్యం వాయిదా వేస్తుంటే గుర్తింపు సంఘంగా గెలిచిన సింగరేణి కాంగ్రెస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో యాజమాన్యాన్ని కలిసి ప్రమోషన్లు ఇప్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అసిస్టెంట్ పిట్ సెక్రటరీ భూక్యా గణేశ్, మైన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అలాగే సింగరేణి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు ఐన శ్రీనివాసాచారి గురువారం జీఎం రాజేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

**కేటీకే ఓసీ-2 గనిలో భూ నిర్వాసితుల ధర్నా**

భూపాలపల్లి సింగరేణి ఏరియాలోని కేటీకే ఓసీ-2 పనులను అడ్డుకొని వెంటనే నష్ట పరిహారం అందజేయాలని కోరుతూ గడ్డిగానిపల్లి భూ నిర్వాసితులు ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ కేటీకే ఓసీ-2 గని విస్తర్ణ పనుల కోసం సింగరేణి సంస్థ భూములు తీసుకున్నదని, పూర్తి నష్ట పరిహారం చెల్లించకుండా నాలుగేళ్లుగా కాలయాపన చేస్తుండడంతో ధర్నా చేస్తున్నట్లు చెప్పారు.

## చేపల వేటకు వెళ్లి చెరువులో మునిగి వ్యక్తి మృతి

వాజేడు, నవంబర్ 21 : చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై హరీశ్ కథనం ప్రకారం.. చింతూరు జీపీ పరిధి లక్ష్మీపురం గ్రామానికి చెందిన లోడిగె రామ్మూర్తి (56) గురువారం గ్రామానికి చెదిన వాసం కృష్ణయ్య, మడే ధర్మరాజుతో కలిసి చేపల వేటకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయాడు. దీంతో గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## దేవాదుల ఎత్తిపోతల మోటర్లు పునః ప్రారంభం

కన్నాయిగూడెం, నవంబర్ 21: దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద మోటర్లను గురువారం పునః ప్రారంభించారు. సాంకేతిక కారణాలతో బుధవారం అన్ని మోటర్లు నిలిచిపోయాయి. తిరిగి ఫేస్-2 లోని రెండో మోటర్ ఆన్ చేసి రోజుకు 247 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి తరలిస్తున్నట్లు డీఈ శరత్, ఏఈఈ సాయిరాం తెలిపారు.

## విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్‌లు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో గురువారం అధికారులు విద్యార్థులకు చెకుముకి లాలెంట్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ప్రధానం చేశారు.



మొగుళ్లపల్లిలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న అధికారులు

## గాంధీనగర్ ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

గణపురం, నవంబర్ 21: మండలంలోని గాంధీనగర్ జీపీ పరిధి పరకాల-భూపాలపల్లి ప్రధాన జాతీయ రహదారి పక్కన 205,206 సర్వే నంబర్ గల ప్రభుత్వ భూమిలో శుక్రవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల క్రితం ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డును కొందరు తొలగించడంతో తహసీల్దార్ సత్యనారాయణస్వామి మళ్లీ బోర్డును ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ భూమిని కొనుగోలు చేసిన ఆర్మీ ఉద్యోగికి ఫోన్ ద్వారా సమాచారం ఇస్తామన్నారు.

## బహుళ అంతస్తుల నిర్మాణదారుడికి నోటీసులు

**'నమస్తే' కథనానికి స్పందన**

వాజేడు, నవంబర్ 21 : ఎలాంటి అనుమతులు లేకుండా బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తున్న వ్యక్తికి గురువారం అధికారులు నోటీసులు ఇచ్చారు. 'నమస్తే తెలంగాణ'లో బుధవారం 'యథేచ్ఛగా బహుళ అంతస్తుల నిర్మాణాలు' అనే కథనానికి స్పందించిన అధికారులు చెరుకురు గ్రామంలోని భవన నిర్మాణాలను నిలిపివేసి యజమాని లొటపెటల శివశంకర్‌కు నోటీసులు ఇచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీవో శ్రీకాంత్‌నాయుడు హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గుమాస్తా పొదిల సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## విగ్రహ పనులు త్వరగా పూర్తి చేయాలి

**లక్ష్మీనర్సింహారావు**

ఏటూరునాగారం, నవంబర్ 21 : మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డులో వేగంగా జరుగుతున్న అభయాంజనేయస్వామి విగ్రహ నిర్మాణ పనులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దాత కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు గురువారం పరిశీలించారు. ఇటీవల శంకుస్థాపన పనులు చేపట్టారు. విగ్రహాన్ని నిలబెట్టేందుకు అవసరమైన గద్దె నిర్మాణం 25 అడుగుల లోతు నుంచి జరుగుతోంది. ప్రస్తుతం జరిగిన పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట నాయకులు కాకులమర్రి ప్రదీప్‌రావు, గడదాసు సునీల్ కుమార్, తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, గండపెల్లి నర్సయ్య, మాదిరి రాంబాబు, కాళ్ల రామకృష్ణ ఉన్నారు. అనంతరం మండలకేంద్రం లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న గణపార పు శైలజ కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి రూ. 5వేల నగదును లక్ష్మీనర్సింహారావు ఆధ్వర్యంలో అందచేశారు. తాడూరి రఘు, కుమ్మరి చంద్రబాబు, జాడి భోజారావు పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయంలో మంటలు



ఆలయంలో వస్తున్న మంటలు

మహదేవపూర్, నవంబర్ 21 : మండలంలోని అంబట్‌పల్లి అమరేశ్వర ఆలయ ఆవరణలో ఉన్న హనుమాన్ ఆలయంలో గురువారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలు ఎలా వ్యాపించాయో తమకు తెలియడం లేదని, ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆలయ చైర్మన్ సూర్యనారాయణ తెలిపారు. పోలీసులు ఆలయానికి చేరుకొని మంటల వ్యాప్తికి గల కారణాలపై విచారణ చేస్తున్నారు.

## ఆయా కుటుంబానికి ఆర్థిక సాయం

వెంకటాపూర్, నవంబర్ 21 : మండలంలోని నర్సాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలోని ఆయా శంకరమ్మ గురువారం మృతి చెందగా జిల్లా సంక్షేమ శాఖ అధికారి శిరీష ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి దహన ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ తరపున అందజేశారు. వారి వెంట సూపర్‌వైజర్ కావ్య, అంగన్వాడీ టీచర్లు సునీత, శోభ, వసంత ఉన్నారు.